క్లుప్తంగా

రోడ్డు ప్రమాదాలపై అవగాహన అవసరం



వాహనాల రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌ఐ

పాలసముద్రం: రహదారి ప్రమాదాలపై అవగాహన అవసరమని, హెల్మెట్, మాస్క్ విధిగా ధరించాలని ప్రసాద్ కోరారు. ఆదివారం తన సిబ్బందితో కలసి బలిజకండ్రిగ–షోళింగర్ జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. సరైన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి జరిమానా విధించి ఆయన మాట్లాడారు. రహదారి భద్రత–మనందరి బాధ్యత అనేది గుర్తెరిగి ద్విచక్రవాహనదారులు, ఆటో, లారీ డ్రైవర్లు వాహనాలు నడపాలన్నారు. ఏఎస్‌ఐ చక్రవర్తి, హెడ్ కానిస్టేబుల్ బాల పాల్గొన్నారు.

అలరించిన మహాభారత పారాయణం



మహాభారత పారాయణం చేస్తున్న భాగవతారులు

నగరి: చింతలపట్టెడలోని ద్రౌపదీ అమ్మవారి ఆలయ తిరనాళ్లలో భాగంగా ఆదివారం మహాభారత పారాయణం నిర్వహించారు. భాగవతారులు షకీల, కభాళీశ్వరన్ మహాభారత పారాయణం చేశారు. తిరనాళ్లు ముగిసేంత వరకు ఆలయం వద్ద మహాభారత పారాయణం జరుగుతుందని ఉత్సవ నిర్వాహకులు ఎంపీ నటరాజన్ తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ.75 వేల విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌కు చెందిన భక్తుడు నాగేశ్వరరావు ఆదివారం రూ.75 వేలు విరాళం ఇచ్చారు. నగదును ఆలయ కార్యాలయంలో ఏఈఓ సతీష్ మాలిక్, సూపరింటెండెంట్ విజయసారథికి అందజేశారు. అధికారులు వారికి స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించారు. వేదపండితులు ఆశీర్వచనం పలికి స్వామి, అమ్మవార్ల తీర్థప్రసాదాలను అందజేశారు.

అంకమ్మ ఆలయంలో చోరీ



చోరీ జరిగిన అంకమ్మ ఆలయం

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): తొట్టంబేడు మండలం లింగమ నాయుడుపల్లి పంచాయతీలో నూతనంగా నిర్మించిన శ్రీఅంకమ్మ ఆలయంలో చోరీ జరిగింది. ఇటీవల గుడి నిర్మాణం పూర్తవడంతో గ్రామస్తులు నెల రోజుల క్రితం మహా కుంభాభిషేకం నిర్వహించారు. అమ్మవారి గుడి గ్రామానికి శివారులో ఉండడంతో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. అమ్మవారి నగలు, దీప స్తంభాలు, ఎలక్ట్రికల్ వస్తువులు అపహరించారు. వీటి విలువ సుమారు రూ. లక్ష ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేస్తున్నారు.

ప్రత్యేక అలంకారంలో నేత్ర ప్రదాయిని



అలంకరణలో దేశమ్మ

నగరి: ఆడి పూజలను పురస్కరించుకుని టీఆర్ కండ్రిగలోని దేశమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం ముందున్న అమ్మవారి పాదుకల వద్ద పొంగళ్లు సమర్పించారు. ఆలయ నిర్వాహకులు భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు అమ్మవారి దర్శనం చేసుకుని తీర్థం కళ్లలో చల్లుకున్నారు. ఆలయం వద్ద పలువురు భక్తులు స్వచ్ఛందంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ వేణుబాబు, ఈఓ మునికృష్ణయ్య, ధర్మకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బతుకు చూపిన మార్గం





జాతీయ రహదారిలో వెళ్లే ప్రయాణికులకు కొత్తరకం పండ్లు విక్రయిస్తున్న అశోక్‌కుమార్, బ్యాగ్‌లు విక్రయిస్తున్న సల్మాన్

- సంచార వ్యాపారమే జీవనాధారం
- తట్టా బుట్టే స్థిరాస్తులు
- వాహనదారుల ఆకర్షణే వ్యాపార చిట్కా

నగరి: బతుకు తెరువుకోసం వేర్వేరు రాష్ట్రాల నుంచి వచ్చేశారు. పేదరికం, ఉన్న చోటే దుకాణాలు పెట్టుకునే స్థోమత, పెట్టుబడి లేకపోవడం. కష్టాలు తొలగించే ఉద్యోగాలు లభించకపోవడం.. మరోవైపు కుటుంబాన్ని పోషించాల్సిన భాధ్యత ఉండడంతో రాష్ట్రాలను వదలిపెట్టి సంచార వ్యాపారాన్ని ఎంచుకున్నారు. కొందరు వయసు మీదపడ్డ పరిస్థితిలో సంపాదన గత్యంతరం కావడంతో కూలి పనులకు వెళ్లలేక జాతీయ రహదారిలో వెళ్లే ప్రయాణికులనే తమ జీవన పోషకులుగా ఎంచుకున్నారు. రోడ్డు కూడళ్ల వద్ద, స్పీడ్ బ్రేకర్ల వద్ద, టోల్ గేట్ల వద్ద ప్రయాణికులకు తమ వద్ద ఉన్న వస్తువులను విక్రయిస్తూ వ్యాపారానికి కాదేదీ అనర్హం అంటూ జీవనాన్ని సాగిస్తున్నారు. దుకాణాల అవసరం లేకుండా, అద్దె, కరెంటు బిల్లులు కట్టే ఒత్తిడి లేక తమ వద్ద ఉన్న బుట్ట, తట్ట, బ్యాగులే స్థిరాస్తులుగా మలుచుకుని సజావుగా వ్యాపారం చేసుకుంటున్నారు. వివిధ వాహనాల్లో జాతీయ రహదారిపై ప్రయాణించే వారికి పూలు, పండ్లు, వేరుశనగ, మొక్క జొన్నలు, ఉసిరికాయలు, తాటిబెల్లం, ఆటబొమ్మలు అంటూ వివిధ రకాలైన వస్తువులను అమ్ముకుంటున్నారు. కుటుంబ నిర్వహణకు సరిపడా ఆదాయం వస్తుండడంతో కొందరు వ్యాపారులు మరింత ముందడుగు వేసి వినూత్నంగా రంబుటాన్, మంగుస్తాన్, డేట్స్, ప్లంబ్స్, ఆస్ట్రేలియన్ పాల్‌బేరి, రెడ్ బేరి, వాల్‌బేరి అంటూ కొత్తరకం పండ్లు, కాయలను బుట్టల్లో ఉంచుకుని వాహనదారులను ఆకర్షిస్తున్నారు. ఇలా జాతీయ రహదారిని నమ్ముకుని బతుకు జీవనం సాగిస్తున్నారు. జిల్లాలో సుమారుగా 2 వేల మందికి పైగా ఉన్నారు. వీరికి రాష్ట్రాలతో సంబంధం లేదు. జాతీయ రహదారిలో ఎక్కడ వ్యాపారం జరుగుతుందని భావిస్తే అక్కడికి వెళుతూ సంచార వ్యాపారులుగా జీవితం గడుపుతున్నారు.

మా జీవితాన్ని నడిపిస్తోంది



నా పేరు అశోక్ కుమార్, తమిళనాడు తిరువణ్ణామలై కుట్టూరు గ్రామం. బీఏ ఎకనామిక్స్ చేశాను. రూరల్ గేమ్స్ ఆఫ్ ఇండియా 2018లో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో నేషనల్స్‌కు ఎంపికై జమ్ములో నిర్వహించిన పోటీలో ఆడాను. సెకండ్ ప్లేస్‌లో నిలిచాను. అన్ని అర్హతలున్నా డబ్బులు ఖర్చుచేసే స్థోమత లేకపోవడంతో ఉద్యోగం దొరకలేదు. దీంతో ఈ వృత్తిని ఎంచుకున్నాను. ప్రస్తుతం తమిళనాడు విల్లివాక్కంలో ఉంటున్నాను. నగరి నుంచి తిరుత్తణి వెళ్లే జాతీయ రహదారి పక్కనే పండ్లను విక్రయిస్తాను. రాత్రి 2 గంటలకు కోయంబేడు మార్కెట్‌కు వెళ్లి సరుకులు తెచ్చుకుంటా. అక్కడి నుంచి ఉదయానికంతా నగరికి వచ్చి విక్రయించుకుంటా. ఒకసారి సరుకులు తెచ్చుకుంటే నాలుగు రోజులకు వ్యాపారం చేస్తా. రాత్రిళ్లు పండ్లు అమ్మే చోటే రోడ్డుకు సమీపంగా నేలపై అట్టలు పరుచుకుని నిద్రపోతా. ఉదయం సమీపంగా ఉన్న నీటి కొళాయిల వద్ద స్నానం చేసి మళ్లీ వచ్చి అమ్మకాలు ప్రారంభిస్తా. పెద్దగా సంపాదన లేకపోయినా జీవితం సుగమంగా సాగిపోవడానికి సరిపడా సంపాదన వస్తోంది. అందరిలా ఆపిల్, దానిమ్మ, ఆరంజ్ అంటూ అమ్మితే కార్లలో వెళ్లేవారు చూసి వెళ్లిపోతున్నారు. ఆకర్షణీయంగా ఉంటేనే వాహనాలు ఆగుతాయి. అందుకే మార్కెట్‌కు వచ్చే కొత్త రకం పండ్లయిన రంబుటాన్, మంగుస్తాన్, డేట్స్, ప్లంబ్స్, రెడ్‌బేరి, ఆస్ట్రేలియన్ పాల్‌బేరి, వాల్‌బేరి లాంటివి తెచ్చి విక్రయిస్తున్నాను. వాహనాల్లో వెళ్లేవారు వీటిని చూసి ఆగి ఏ పండ్లని అడిగి మరీ తీసుకెళ్తున్నారు. జాతీయ రహదారి పక్కన వ్యాపారమే నా జీవితాన్ని నడిపిస్తోంది.

రాజస్తాన్ నుంచి వచ్చాను



నా పేరు సల్మాన్, రాజస్థాన్‌కు చెందిన వాడిని. శ్రీకాళహస్తిలో గది అద్దెకు తీసుకుని ఉంటూ రోడ్‌సైడ్ వ్యాపారం చేస్తున్నాను. పాఠశాలలు తెరిచే సమయంలో స్కూల్ బ్యాగ్‌లు, లగేజ్ బ్యాగ్‌లు, శీతాకాలం దుప్పట్లు, వేసవిలో టోపీలు, కళ్ల అద్దాలు అంటూ రోడ్డు పక్కనే నిలబడి అమ్ముకుంటాను. నా వ్యాపార మూలధనం రెండు బ్యాగులే.. అందులో సరుకులు తెచ్చుకుని అమ్ముకుంటాను. జాతీయ రహదారిలో ఒక్కోరోజు ఒక్కో ప్రాంతంలో ఉంటూ ప్రయాణికులకు బాగా కనిపించేలా పేర్చి వాహనాల్లో వచ్చేవారిని ఆకర్షించే ప్రయత్నం చేస్తాను. కొన్ని రోజులు అమ్మకాలు ఎక్కువగా ఉంటాయి. కొన్ని రోజులు ఉండవు. ఇలా ఏడేళ్లుగా రహదారి పక్కన విక్రయాలనే నమ్ముకుని జీవిస్తున్నాను. నా కుటుంబాన్ని పోషించుకోగలుగుతున్నాను.



తిరునగరిపై మేఘమాలిక..

అల్పపీడనం ప్రభావంతో గడిచిన మూడు రోజులు తిరుపతిలో చిరుజల్లులు పడ్డాయి. వర్షం తెరిపి ఇవ్వడంతో మేఘావృతమైన ఆకాశం కాస్త వెండి మబ్బులు తేలియాడుతూ కనిపించి కనువిందు చేశాయి. –తిరుపతి

తిరుపతి ప్రాశస్తిలో యాదవుల పాత్ర ఎనలేనిది

తిరుపతి కల్చరల్: తిరుమల, తిరుపతి అభివృద్ధి, ప్రాశస్తిలో యాదవుల పాత్ర ఎనలేనిదని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కొనియాడారు. టీఎంఆర్ కల్యాణ మండపంలో ఆదివారం అఖిల భారత యాదవ మహాసభ తిరుపతి జిల్లా ప్రథమ సమావేశం నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే భూమన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తిరుపతిని 900 ఏళ్ల నుంచే యాదవ రాజులు పరిపాలించారని తెలిపారు. యాదవుల పిలుపు మేరకే రామానుజాచార్యులు తిరుపతిని నిర్మించడంతో పాటు తిరుమలలో అర్చకత్వం స్థిరం చేశారని పేర్కొన్నారు. 1252లో వీర నరసింగ యాదవరాజు తిరుమలలో మండపం రూపంలోనున్న ఆలయాన్ని 10 అడుగులు పెంచడంతోపాటు గోపురాన్ని నిర్మించి నిలువెత్తు బంగారు తాపడం చేయించారని తెలిపారు. 150 ఎకరాల భూమిని తిరుమలకు మాన్యంగా ఇచ్చి వచ్చే ఆదాయంతో నిత్యం అన్నదానం చేయించాలని పేర్కొన్నారని తెలిపారు. వీరనరసింగ యాదవరాజు పేరును కొర్లగుంట రోడ్డుకు నామకరణం చేయనున్నట్లు తెలిపారు. తిరుమల శ్రీవారిని తొలుత గుర్తించి దర్శించుకున్న శరబయ్య పేరును తిరుపతి మాస్టర్ ప్లాన్ రోడ్డుకు నామకరణం చేయిస్తానని తెలిపారు. యాదవులు ఐక్యతతో ముందడుగు వేస్తూ సమాజ శ్రేయస్సులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మేయర్ శిరీష మాట్లాడుతూ తిరుమల శ్రీవారి తొలిదర్శన భాగ్యం యాదవులకు భగవంతుడు ఇచ్చిన వరమని తెలిపారు. తిరుమలలో సన్నిధి గొల్ల సమస్యను ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారని కొనియాడారు. తిరుపతిలో మేయర్ పదవితో పాటు టౌన్ బ్యాంకు వైస్ చైర్మన్, గంగమ్మ ఆలయ చైర్మన్ పదవులను యాదవులకు ఇచ్చారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి సహకారం అందించాలని కోరారు. అఖిల భారత యాదవ మహాసభ జాతీయ అధ్యక్షుడు బుసగాని లక్ష్మయ్య పాల్గొన్నారు.


భక్తిప్రపత్తులతో అగ్నిగుండ మహోత్సవం



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

పిచ్చాటూరు: ధర్మరాజుస్వామి ఆలయ తిరునాళ్లలో భాగంగా ఆదివారం సాయంత్రం భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. అంతకు ముందు ఉదయం 7 గంటలకు భీముడు, దుర్యోధనుని వధించే ఘట్టాన్ని కళాకారులు రక్తి కట్టించారు. 9 గంటలకు అలుగు ఉత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అగ్నిగుండం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం దీక్షాపరులు ఏడు ఎల్లలు నడిచి అక్కడి బావుల్లో పుణ్య స్నానాలు ఆచరించి స్థానిక గ్రామ దేవత గంగమ్మ ఆలయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి విశ్వరూపిణి అలంకారంలో ఉన్న ద్రౌపదీ అమ్మవారితో కలిసి ఊరేగింపుగా ధర్మరాజు ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయం వద్ద ద్రౌపదీ అమ్మవారిని అగ్నిగుండం అభిముఖంగా ఉంచి దీక్షాపరులు భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. రాత్రి అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. కేరళ కళాకారుల వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్థానిక సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి, గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పిచ్చాటూరు, నారాయణవనం ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, పరమేశ్వర్ నాయక్, సునీల్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఇసుక రీచ్‌ల నిలిపివేత



మాట్లాడుతున్న తహసీల్దార్ శిరీష, సీఐ

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలంలోని నాగయ్యగారిపల్లి, రెడ్డివారిపల్లెలో ఇసుక రీచ్‌లను నిలిపివేస్తున్నట్లు తహసీల్దార్ శిరీష, సీఐ రాజశేఖర్ తెలిపారు. ఆమె ఆదివారం మాట్లాడుతూ ఇసుక రీచ్‌లను నిలిపివేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇసుక రీచ్‌లలోకి ఎవరినీ అనుమతించడం లేదని, ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుక రీచ్‌ల వద్ద పర్యవేక్షించాలని రెవెన్యూ, పోలీసు అధికారులను ఆదేశించారు.

బైపాస్ నిర్మాణానికి సహకరించాలి

- రోడ్డు నిర్మాణాన్ని 150 నుంచి 100 అడుగులకు తగ్గిస్తాం
- పూర్తిగా భూమిని కోల్పోయే రైతులకు అదనంగా ఇంటి పట్టాలు ఇస్తాం
- ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామన్న ఎమ్మెల్యే ఆదిమూలం



మాట్లాడుతున్న సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు: దాసుకుప్పం బైపాస్ రోడ్డు నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం విజ్ఞప్తి చేశారు. ఆదివారం నాగలాపురం మండలం సురుటుపల్లిలోని మిట్టకండ్రిగలో దాసుకుప్పం బైపాస్ రోడ్డు భూ నిర్వాసితుల సమావేశం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ప్రాంత రైతుల ఆకాంక్షను వివరించిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రోడ్డు నిర్మాణానికి రూ.26 కోట్ల నిధులను మంజూరు చేశారన్నారు. ఇలా మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకుని త్వరితగతిన రోడ్డు నిర్మాణం పూర్తి చేయడానికి భూ నిర్వాసితులు సహకరించాలని కోరారు. రైతుల విన్నపం మేరకు రోడ్డు వెడల్పును 150 మీటర్ల నుంచి 100 మీటర్లు తగ్గిస్తామని, తక్కువ భూమి (10–20 సెంట్లు) ఉండి పూర్తిగా భూమిని కోల్పోయే రైతులకు వేరే చోట ఇంటి పట్టాలు ప్రభుత్వం ద్వారా మంజూరు చేస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ హామీల గురించి కలెక్టర్, ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులతో ఇప్పటికే మాట్లాడానని తెలిపారు. రోడ్డు వల్ల భూమిని కోల్పోయే ప్రతి ఒక్కరిని ఆదుకోవాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు.

బైపాస్‌తో సమగ్రాభివృద్ధి

బైపాస్ రోడ్డు నిర్మాణంతో సత్యవేడు, నాగలాపురం సరిహద్దు ప్రాంతాలు సమగ్రాభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. రోడ్డు పనులు పూర్తయితే ఈ ప్రాంతంలో భూముల విలువ పెరగడంతో పాటు వ్యాపార అభివృద్ధి చెంది స్థానికులకు జీవనోపాధి కలుగుతుందన్నారు. అదే సమయంలో నియోజకవర్గ ప్రజలు తమిళనాడు భూభాగంలోకి వెళ్లకుండా పర్యటించవచ్చన్నారు. ప్రజలతో పాటు ప్రభుత్వానికి ఏటా రూ.44 లక్షలు ఆదా అవుతుందన్నారు. తమిళనాడులో కిలోమీటరు ప్రవేశించడం వల్ల అక్కడ చిన్న సమస్య తలెత్తినా తమను రాకపోకలకు అనుమతించక ఇబ్బంది పెట్టడాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. మన వాహనాలకు రకరకాలుగా జరిమానాలు, మామూలు వసూలు చేసి వేధించడం నిజం కాదా..? అని ప్రశ్నించారు. ఇవన్నీ పరిష్కారం కావాలంటే మన భూభాగంలో వెళ్లే దాసుకుప్పం బైపాస్ రోడ్డు తప్పనిసరి అని ఈ ప్రాంత వాసుల 3 దశాబ్దాల కోరిక అన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ ధనంజయులు, ఏఈ ఇజ్రాయేల్, సురుటుపల్లి, దాసుకుప్పం సర్పంచ్‌లు కాంతమ్మ, రవిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అపరంజిరాజు, శ్రీపళ్లికొండేశ్వరాలయం చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, సభ్యులు రఘు, మాజీ సభ్యులు జయప్రకాష్, సుబ్రమణ్యం, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, లోకయ్య రెడ్డి, రంగనాథం, ఎస్‌ఎం సురేష్, పాలపద్మనాభం, తొప్పయ్య, వీఆర్‌ఓ నాగభూషణం పాల్గొన్నారు.

ఆడికృత్తిక వేడుకలకు ముస్తాబు



ఆలయం వద్ద జేసీబీతో చేస్తున్న బండల తొలగింపు పనులు

- డిప్యూటీ సీఎం చొరవతో రూ.75 లక్షలు మంజూరు

కార్వేటినగరం: ప్రసిద్ధి చెందిన స్థానిక స్కంధ పుష్కరిణి సమీపంలో కుమార గిరిపై ఉన్న వళ్లీ, దేవసేన సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయం ఈ నెల 8వ తేదీ నుంచి ఆడికృత్తిక వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి చొరవతో ఆలయ అభివృద్ధికి రూ. 75 లక్షలు మంజూరు చేశారు. దీంతో ఆలయం చుట్టు పార్కింగ్ ఏర్పాటుకు జేసీబీలతో బండలను తొలగించి, భక్తులు నిద్ర చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే రూ.40 లక్షలతో ఆలయానికి ప్రహరీగోడ నిర్మించారు. ఆలయంలో రూ.35 లక్షలతో ఫ్లోరింగ్ ఏర్పాటు చేశారు. కుమార గిరికి భక్తుల వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్డు వేశారు. ఆలయం పై భాగం ఉరుపులు లేకుండా పనులు చేశారు. ఆలయ ఆవరణలో దాతల సాయంతో పోటు నిర్వహణకు భవనాన్ని నిర్మిస్తున్నారు.

–ఆలయాలకు నిలయం కార్వేటినగరం



కార్వేటినగరం సంస్థానాధీశుల కాలంలో అనేక ఆలయాలు నిర్మించారు. కార్వేటినగరాన్ని ఆలయాలకు నిలయంగా మార్చారు. ఆ ఆలయాలకు పునర్వైభవం తెచ్చేందుకు దేవదాయశాఖ నుంచి రూ.75 లక్షలు మంజూరు చేయించా. అలాగే స్కంధ పుష్కరిణిలో నిరాలి మండపం నిర్మాణానికి రూ.1.2కోట్లు, స్కంధ పుష్కరిణి చుట్టూ పార్కు ఏర్పాటుకు రూ. 40 లక్షలు మంజూరు చేయించాను.

–కళత్తూరు నారాయణస్వామి, ఉప ముఖ్యమంత్రి



కళకళలాడుతున్న స్కంధ పుష్కరిణి

మానవ అక్రమ రవాణాను నియంత్రించాలి

- సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు రూరల్: మానవ అక్రమ రవాణాను నియంత్రించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సీ రాఘవేంద్ర అన్నారు. ఆదివారం మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఎస్సీ, బీసీ బాలికల వసతి గృహం వద్ద న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ.. బాలికలు, మహిళలు అపరిచితులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లలు తల్లిదండ్రులకు తెలియకుండా బయటకు వెళ్లరాదని చెప్పారు. మానవ అక్రమ రవాణా చేసినా, ప్రోత్సహించినా చట్టరీత్యా శిక్షార్హులని తెలిపారు. మానవ అక్రమ రవాణాపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సదస్సులో వసతి గృహాల వార్డెన్లు జయసుధ, భాను పాల్గొన్నారు.



పుత్తూరులో రైల్వే గేటును మూసివేసిన రైల్వే సిబ్బంది

గేటుపాట్లు..!

పుత్తూరు రూరల్: పుత్తూరు పట్టణంలోని నారాయణవనం రైల్వే గేటును మరమ్మతుల పేరిట తరచూ మూసివేస్తుండడంతో ప్రయాణికుల పాట్లు వర్ణనాతీతం. పట్టణంలోని రైల్వేగేట్ నంబర్ 56 వద్ద ఉన్న లిఫ్టు గేటును ఆదివారం మరమ్మతుల పేరిట మూసివేశారు. ఈ గేటును నెలలో ఒకటి నుంచి రెండు రోజుల పాటు మరమ్మతుల పేరిట మూసివేయడం రివాజుగా మారింది. తిరుపతి–చెన్నై జాతీయ రహదారి మధ్యలో ఉన్న ఈ గేటు మూసివేత కారణంగా పలు వాహనాలు బారులు తీరి నిలిచిపోతుంటాయి. విషయం బోధపడ్డాక వాహనదారులు 4 కిలో మీటర్ల మేర అదనంగా మరోమార్గం ద్వారా ప్రయాణించాల్సి వస్తోంది. అసలు ఈ మరమ్మతుల మర్మమేమిటని స్థానికులు ప్రశ్నిస్తుంటారు. ఇదో బేతాళ ప్రశ్నగా మిగిలిపోయిందే తప్పా దీనికి రైల్వే అధికారుల నుంచి సమాధానం ఉండదు. ఈ తంతు కొన్నేళ్లుగా జరుగుతున్నా రైల్వే శాఖ అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదు. ఈ గేటుకు సమీపంలోని రైల్వే గేట్ నంబర్ 57 వద్ద రాని మరమ్మతులు ఇక్కడ మాత్రం వస్తుండడం ఏంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇకనైనా రైల్వే శాఖ ఉన్నతాధికారులు గేట్ నంబర్ 56 వద్ద గల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రీన్ అంబాసిడర్ల సేవలతో పరిసరాల శుభ్రత



గ్రీన్ అంబాసిడర్లకు దుస్తులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

పాలసముద్రం: మండలంలోని గ్రీన్ అంబాసిడర్లు అందిస్తున్న సేవల వల్ల పరిసరాలు శుభ్రంగా ఉంటున్నాయని జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం పాలసముద్రంలో గ్రీన్ అంబాసిడర్లతో ఎంపీపీ సుబ్రమణ్యారెడ్డి, సర్పంచ్ అయ్యప్ప సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ, కరోనా సమయంలో గ్రీన్ అంబాసిడర్లు, ఆరోగ్య సిబ్బంది ప్రజలకు ఎనలేని సేవలు చేశారన్నారు. వారి వేతనాలను పంచాయతీ కార్యదర్శులు సక్రమంగా ఆన్‌లైన్ చేయాలన్నారు. గ్రీన్ అంబాసిడర్లు వచ్చాక గ్రామాల్లో పారిశుద్ధ్యం సమస్యలు లేవని పేర్కొన్నారు. అనంతరం గ్రీన్ అంబాసిడర్లకు వారి సొంత ఖర్చులతో దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలి మహేష్ బాబు పాల్గొన్నారు.